సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం। 4। ఆగస్టు। 2023



కొలువుల కాణాచి జేఎన్‌టీయూ

ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల సందడి మొదలైంది. ఉత్తమ ప్రమాణాలున్న కళాశాలలను ఎంపిక చేసుకునే పనిలో ఇంజినీరింగ్ అభ్యర్థులు బిజీగా ఉన్నారు. - 8లో



వీఆర్ఎస్ నీటి విడుదల

వీఆర్ఎస్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా సాగునీటిని డిప్యూటీ సీఎం రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి గురువారం విడిచిపెట్టారు. - 8లో



ఏర్పాట్లు పూర్తి

విజయనగరం జిల్లా వేదికగా నిర్వహించ తలపెట్టిన ఏపీయూడబ్ల్యూజే 26వ మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు విశాఖపట్నంలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. గురువారం ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ దేవేంద్రశర్మ, నితీష్‌కుమార్ వ్యాస్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా పాల్గొన్న రెండో రోజు సదస్సులో కలెక్టర్ నిశాంత్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. జిల్లాలో చేపడుతున్న ఓటరు జాబితా సవరణలు, బీఎల్‌వోలు ఇంటింట సర్వే, యాప్ వినియోగం, ఇంటి నంబర్ల నమోదు చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఒకే ఇంటి నంబరుపై ఉన్న ఓట్లపై చేపడుతున్న చర్యలు తదితర అంశాలపై వివరించారు. జిల్లాలో కళాశాలల్లో సదస్సులు నిర్వహించి యువ ఓటర్లను నమోదు చేస్తున్నట్టు వివరించారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత



ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలో 6 నెలల క్రితం ఏనుగుల దాడిలో మృతి చెందిన అడపా దేశీనాయుడు కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్కును జిల్లా అటవీ శాఖాధికారిణి ప్రసూన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగారావు తన క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, రేంజర్ త్రినాథరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలకు తావివ్వొద్దు... : సబ్ కలెక్టర్

పాలకొండ రూరల్: సమగ్ర భూ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ స్పష్టం చేశారు. మండలంలోని పెద్దకోటిపల్లి గ్రామంలో కొనసాగుతున్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను తహసీల్దార్ పి.సోమేశ్వరరావుతో కలసి గురువారం పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పనులకు ఆటంకం లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. సర్వే ప్రాప్తికి రాళ్లను నిర్దేశిత సరిహద్దులు సూచిస్తూ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే ప్రక్రియలో తప్పిదాలకు తావివ్వకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ సింగంవలస మంగామణి, విజయ్‌కుమార్, మండల సర్వేయర్ పి.వెంకటరావు తదితరులున్నారు.

ఐటీడీఏ పీవో విస్తృత పర్యటన

- బీఎల్‌వోలకు షోకాజ్‌లు ఇవ్వాలని ఆదేశం



తూడి పోలింగ్ స్టేషన్ వద్ద బీఎల్‌వోలతో మాట్లాడుతున్న పీవో కల్పనాకుమారి

వీరఘట్టం: సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించారు. పనసనందివాడ, రేగులపాడులో నిర్మాణంలో ఉన్న జగనన్న హౌసింగ్ లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ లబ్ధిదారులతో మాట్లాడారు. లేఅవుట్లలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ వినోద్‌ను ఆదేశించారు. అనంతరం బిటివాడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజినీరింగ్ అధికారి డి.కల్యాణిదుర్గను ఆదేశించారు. ఈ నెలాఖరుకు భవన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తూడి గ్రామంలో 265, 266 పోలింగ్ కేంద్రాలను, హుస్సేనుపురంలో 261 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి చేపడుతున్న ఓటర్ల సర్వేను వేగవంతంగా, పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఓటర్ల సర్వేలో వెలుగు చూసిన లోపాలపై పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

పంచాయతీల్లో పారదర్శక పాలన

- గ్రామస్థాయిలో అవినీతికి చెక్‌పెట్టేలా చర్యలు
- ఇకపై డిజిటల్ విధానంలో పన్నుల చెల్లింపు
- ఈ నెల 15 నుంచి పంచాయతీల్లో అమలు
- ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు

పాలకొండ రూరల్:

పంచాయతీల్లో పారదర్శక పాలనకు జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అధిక ప్రాధాన్యమిస్తోంది. నగదురహిత 'డిజిటల్' చెల్లింపులను ప్రోత్సహిస్తోంది. అన్ని పంచాయతీల్లోనూ ఈ నెల 15 నుంచి డిజిటల్ విధానంలో పన్నుల వసూళ్లకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆదేశించింది. మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌తో నగదు చెల్లించే ప్రక్రియ అందుబాటులోకి రానుంది.

అవినీతికి ఆస్కారం లేకుండా...

గతంలో గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేసే కొందరు సిబ్బంది ఆ మొత్తాలను సొంత అవసరాలకు వాడుకునేవారు. అధికారులు తనిఖీల్లో ఈ తరహా ఘటనలు బయటపడేవి. సదరు సిబ్బంది నుంచి మొత్తాలను రికవరీ చేసేవారు. తనిఖీలు చేయకుంటే ప్రజలు చెల్లించే పన్నులు ఖజానాకు చేరకుండా చేతివాటం చూపించే సిబ్బంది జేబుల్లోకి వెళ్లిపోయేవి. నూతన విధానంతో ప్రజల నుంచి వసూలు చేసిన ప్రతీ రూపాయి పంచాయతీ ఖాతాకు నేరుగా చేరుతుంది. ఖర్చు చేయాల్సి వస్తే సంబంధిత కాంట్రాక్టర్‌కు కూడా డిజిటల్ పద్ధతిలోనే చెల్లింపులు చేపడతారు. దీంతో ఎలాంటి అవినీతికి ఆస్కారం ఉండదు.

లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారానే..

గ్రామ పంచాయతీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు చెల్లించే నిర్ణీత మొత్తంతో పాటు వివిధ సేవా పన్నులు డిజిటల్ ఆధారిత రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది. దీనికోసం ప్రతీ గ్రామ పంచాయతీ అధికారిక బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారులు ఉపయోగిస్తున్న వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డులు ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక మెషీన్లను ప్రభుత్వం సమకూర్చనుంది. పంచాయతీల్లో నిధుల వినియోగంలో పారదర్శకత పెంచేందుకు వీలుగా ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని నిర్ణయించింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలో 451 పంచాయతీలు ఉన్నాయి. ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల సబ్‌ప్లాన్ పరిధిలో బలిజిపేట, సీతానగరం, గరుగుబిల్లి మినహా మిగిలిన 12 మండలాలు ఉన్నాయి. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో 2 లక్షల 22వేల175 గృహాలు ఉన్నాయి. వీటిలో లక్షా 98వేల873 గృహాల నుంచి ఇంటిపన్నులు వసూలు చేస్తున్నారు. వీటిలో గిరిజన ఆవాసాలు దాదాపు 1,30,121 ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఏటా పన్నుల రూపంలో రూ.4 కోట్ల వరకు ఖజానాకు చేరుతోంది. 2022–23 సంవత్సరంలో పన్నుల రూపంలో వసూలు చేయాల్సిన మొత్తం రూ.3,99,84,179. ఇప్పటివరకు రూ.కోటి 4లక్షలు వసూలైంది. ప్రభుత్వానికి సమకూరే పన్నుల మొత్తంలో కుళాయి పన్నులు, గ్రంథాలయం, వీధి కాలువలు, దీపాల నిర్వహణ నుంచి 52 శాతం, మిగిలిన 48 శాతం ఇంటి పన్నుల రూపంలో జమ కాబడుతుంది. జిల్లా నుంచి వసూలు చేయబడే మొత్తం పన్నుల్లో 50 శాతం మేర గిరిజన ప్రాంతాల నుంచి ఖజానాకు చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ నెల 15 నుంచి పంచాయతీల్లో పన్నుల సేకరణకు సంబంధించి ఒక్క రూపాయి కూడా నగదు రూపంలో అధికారులు స్వీకరించరు. ఆ దిశగా జిల్లా పంచాయతీ అధికారులు గ్రామపంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. దీనిపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నులతో పాటు పంచాయతీలు కొనుగోలు చేసే బ్లీచింగ్, పారిశుద్ధ్య మెటీరియల్, వీధిలైట్ల విడిభాగాలు, గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించిన చెల్లింపులు ఇకపై డిజిటల్ విధానంలోనే జరుగనున్నాయి.



ఈ తరహా పంచాయతీల కార్యాలయాల్లో ఇకపై నగదురహిత పన్నుల స్వీకరణ



పార్వతీపురం మన్యం జిల్లాలోని మండలాల సంఖ్య:	15
పంచాయతీలు:	451
జిల్లాలో గృహాల సంఖ్య:	2,22,175
పన్ను చెల్లిస్తున్న గృహ యజమానులు:	1,98,873
వీటిలో గిరిజనులైన గృహ యజమానులు సంఖ్య:	1,30,121
ఏటా పన్నుల రూపంలో ఖజానాకు చేరే మొత్తం సుమారు:	రూ.4కోట్లు
20022–23లో పన్నుల డిమాండ్:	రూ.39,9,84,179
ప్రస్తుతం వసూలు చేసిన పన్నుల మొత్తం:	రూ.1 కోటి 4 లక్షలు

చాలెంజింగ్‌గా తీసుకుంటున్నాం



డిజిటల్ చెల్లింపులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. జిల్లాలో ఏజెన్సీ మండలాలు, ఆవాసాలు 50 శాతం ఉన్నాయి. ఇక్కడ డిజిటల్ విధానం అమలు చేయడాన్ని చాలెంజింగ్‌గా తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 తర్వాత పంచాయతీలో పన్నులు నగదు రూపంలో తీసుకోవద్దని కార్యదర్శులను ఆదేశించాం. ఇప్పటికే పంచాయతీల్లో డిజిటల్ పేమెంట్ల నిర్వహణకు అన్ని చర్య లు తీసుకుంటున్నాం. బ్యాంకు ఖాతాలు తెరచిన పంచాయతీలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను సేకరిస్తున్నాం.

– బలివాడ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి, పార్వతీపురం మన్యం

ఉత్తుత్తి జీవోలు... పునాది రాళ్లు



- టీడీపీ హయాంలో జిల్లాకు చేసింది ఏమీ లేదు
- చంద్రబాబు పర్యటన అనంతరం వాస్తవాలు తెలియజెప్పేందుకు ప్రాజెక్టుల పరిశీలన
- వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు
- ప్రభుత్వ పాలనపై నమ్మకంతోనే జగనన్న సురక్ష విజయవంతం
- ఉమ్మడి జిల్లాలో నెల రోజుల్లో 6 లక్షలకు పైగా సేవలు మంజూరు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

ప్రతిపక్ష నేత చంద్రబాబు హయాంలో విజయనగరం జిల్లాకు ఉత్తుత్తి జీవోలు.. పునాది రాళ్లే తప్ప... టీడీపీ హయాంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు వారు చేసిందేమి లేదని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలు తమకు మేలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం కావటంపై హర్షం వ్యక్తం చేశారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రంలో పాలన సాగించిన టీడీపీ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయి 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైందని... అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకుందన్నారు. చంద్రబాబు ఏమనుకుంటారోనన్న భయంతో జిల్లాలో చేపట్టిన బస్సు యాత్ర సెల్ఫీ యాత్రలతో ముగించారని.... 4 ఏళ్ల ప్రభుత్వ పాలనలో లోపాలపై ఎందుకు ప్రశ్నించలేకపోయారన్నారు. బస్సు యాత్రలో సెల్ఫీలు తీసుకున్న టీడీపీ నాయకులు తోటపల్లి ప్రాజెక్టు, భోగాపురం ఎయిర్‌పోర్ట్, విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద ఎందుకు ఫొటోలు దిగలేదో చెప్పాలన్నారు. గత నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు - నేడు కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి, అదే పాఠశాలల్లో ప్రారంభించిన డిజిటల్ క్లాస్ రూమ్‌లు, గురజాడ జేఎన్‌టీయూకే యూనివర్సిటీలు ముందుకు వెళ్లి ఎందుకు సెల్ఫీలు దిగలేకపోయారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు స్థాయిని మరచి విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు బీజం వేసింది దివంగత వైఎస్సార్

రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా విజయనగరంలో సాగునీటి ప్రాజెక్టులకు బీజం వేసింది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరెడ్డి అని మజ్జి శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధానమైన తోటపల్లి ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయిస్తే.... 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మిగులు పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించిన విషయాన్ని గర్వంగా చెప్పగలమన్నారు. పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్, వట్టిగెడ్డ, తాటిపూడి, ఆంధ్ర జలాశయాల అభివృద్ధికి నాటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ముందుచూపుతో చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు.

జగనన్న సురక్ష విజయవంతం

2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా ప్రజలకు అవసరమైన ముఖ్యమైన 11 అంశాలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఉచితంగా పంపిణీ చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలో 6లక్షల మంది ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

అడ్డంకులు అధిగమించి టీఆర్‌టీఎస్, విమానాశ్రయం పనులు ప్రారంభం:

నెల్లిమర్ల నియోజకవర్గంలో నిర్మాణ దశలో ఉన్న తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనులతో పాటు భోగాపురం అంతర్జాతీయ విమానశ్రయ నిర్మాణ పనులను కోర్టు కేసులు అధిగమించి ఎటువంటి అడ్డంకులకు లేకుండా పనులు చేపడుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 5 లక్షల మంది ప్రజల దాహార్తిని తీర్చేందుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గడిగెడ్డ నుంచి నీటిని మళ్లించేందుకు కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు మహాయజ్ఞం చేస్తే.. నెల్లిమర్ల మండలంలో నిర్మిస్తున్న టీఆర్‌టీఎస్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసే దిశగా అవసరమైన నిధులు కేటాయించి అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు ముందుకు వెళ్తున్నామని ఇదీ తమ ప్రభుత్వ విధానమని వివరించారు. భీమసింగి సుగర్స్ మూతపడడంతో చెరుకును సంకిలికి తరలించే ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

అయ్యో.. ఎంత ఘోరం...

- విధి వంచితులు
- విద్యుత్ తీగలే మృత్యు పాశాలు
- విద్యుత్ షాక్‌కు గురై ముగ్గురి మృతి
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు
- సోమన్నపేటలో విషాదం

రాజాం/సంతకవిటి:

సంతకవిటి మండలం సోమన్నపేట గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై గ్రామానికి చెందిన పొంద్రంకి కేసరినాయుడు(24), గంద్రేటి చంద్రశేఖర్(18), దూబ రెయ్యమ్మ(57) మృతి చెందారు. పొంద్రంకి రామినాయుడు ఇంటి మొదటి అంతస్తు నిర్మాణ పనుల్లో భాగంగా అతని కుమారుడు కేసరినాయుడు, అదే గ్రామానికి చెందిన అతని స్నేహితుడు గంద్రేటి చంద్రశేఖర్‌ను పనికి పిలిచి డాబా ఎక్కారు. ఆ సమయంలో డాబా మీద ఉన్న 12 ఎంఎం ఇనుప రాడ్‌ను డాబా వెనుక వైపు నెట్టగా, డాబాకు కొద్ది దూరంలో ఉన్న 230 ఓల్ట్స్ విద్యుత్ సరఫరా తీగలకు రాడ్ తగలడంతో రాడ్‌ను పట్టుకున్న ఇద్దరు యువకులు పెద్దగా కేకలు వేస్తూ మృతి చెందారు. డాబా మీద యువకుల అరుపులను ఎదురుగా ఉన్న అంగన్‌వాడీ ఆయా దూబ రెయ్యమ్మ విని వెంటనే డాబా పైకి వెళ్లి పొరపాటున ఇనుప చువ్వను ముట్టుకోవడంతో ఈమె కూడా మృతి చెందింది. ఈ విషయాన్ని గమనిస్తున్న ఒకరిద్దరు ఏదో జరుగుతుందని ఊహించి డాబా ఎక్కకుండా పొలాల్లో ఉన్న కుటుంబీకులకు సమాచారం అందించారు. గ్రామంలోకి వచ్చిన కిరాణా సరుకుల రవాణా వ్యాపారి డోల ప్రసాద్ డాబా వెనుక వైపునకు వెళ్లి ఇనుప రాడ్ స్ట్రీట్ లైన్ విద్యుత్ తీగలకు తగిలి ఉండడాన్ని గమనించి ఎలక్ట్రికల్ ఏఈకి వెంటనే ఫోన్ చేసి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయించారు. అనంతరం డాబా ఎక్కి, ముగ్గురు పడి ఉండడాన్ని గమనించి వారిని కిందకు దించారు. ముగ్గురిలో చంద్రశేఖర్ కొన ఊపిరితో ఉన్నాడనే అనుమానం రావడంతో వెంటనే ప్రైవేట్ వాహనంలో సంతకవిటి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో తిరిగి గ్రామానికి తీసుకొచ్చారు. వీఆర్‌వో కనకమ్మ ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వగా రాజాం రూరల్ సీఐ సీహెచ్ ఉపేంద్ర, సంతకవిటి ఎస్ఐ బి.లోకేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం రాజాం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తరలించి అనంతరం బంధువులకు అప్పగించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు.



చంద్రశేఖర్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

ఎంపీ, ఎమ్మెల్యేల సంతాపం

సోమన్నపేట గ్రామంలో జరిగిన ఘటనకు సంబంధించి రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత పొగిరి సత్యంనాయుడుతో పాటు సంతకవిటికి చెందిన జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావులకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరో వైపు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఈ ఘటనపై మృతుల కుటుంబాలకు సానుభూతి తెలపడంతో పాటు ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపాలని సూచించారు. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్‌లో జరుగకుండా చర్యలు చేపట్టాలని ఎలక్ట్రికల్ అధికారులకు ఆదేశించారు. సంఘటనా స్థలానికి విద్యుత్‌శాఖ రాజాం డీఈఈ జీవీ రమణ, ఏఈలు కుమార్, సయ్యద్‌లు చేరుకుని ప్రమాదంపై పూర్తి స్థాయిలో ఆరా తీశారు.

ఈ క్రాప్ నమోదుకు వేళాయె..

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పరిపాలన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారిని అన్ని విధాలా ఆదుకుంటోంది. సాగులో పెట్టుబడి సాయం నుంచి పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు పంట నష్టాలకు పరిహారం కూడా చెల్లిస్తోంది. ఇందుకుగాను అవసరమైన ఈ క్రాప్ నమోదుకు తాజాగా సిద్ధమైంది.

- చర్యలు చేపట్టిన అధికారులు
- జిల్లాలో 2 లక్షల 75వేల 880 ఎకరాల సాగు భూమి
- మద్దతు ధర పొందడంలో పంటల నమోదు కీలకం
- శత శాతం పూర్తి చేసేందుకు అధికారుల ఏర్పాట్లు

పాలకొండ:

రైతులు సాగు చేసే పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు విపత్తుల సమయంలో రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం పంటల నమోదు ప్రక్రియ చేపట్టింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఆగస్టు మొదటి వారం నుంచి పంటల నమోదును ప్రారంభిస్తున్నారు. జిల్లాలో ఉన్న 306 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ క్రాప్ నమో దు కోసం వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. జిల్లాలో సాగు భూమి 2,75,880 ఎకరా లు ఉంది. ప్రస్తుత ఏడాది శతశాతం ఈ క్రాప్ నమో దు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



పంటల నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ఈ – క్రాప్‌తో ప్రయోజనాలు

రైతులు తమ పంటలను ఈ క్రాప్ చేసుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. పంట అమ్మకం సయమంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేస్తుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే వారికి పరిహారం అందిస్తుంది. బ్యాంకు రుణం పొందాలన్నా, బీమా పరిహారం అందాలన్నా పంటల నమోదు కీలకం. దీనిపై రైతులు అవగాహన పెంచుకుని పంటల నమోదుకు సహకరించాల్సి ఉంది. వ్యవసాయ శాఖ సిబ్బంది నేరుగా రైతుల పొలం వద్దకు వెళ్లి పంట నమోదు చేపడతారు.



సాగులో ఉన్న వరి పంట

శతశాతం పూర్తికి చర్యలు



జిల్లాలో పంటల నమోదు శత శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పని చేస్తున్నాం. రైతులు పంటల నమోదుకు సహకరించాలి. మా సిబ్బంది పొలం వద్దకు వెళ్లి పంట నమోదు చేస్తారు. రైతులు వేసే పంట ముందుగానే తెలుసుకోవడం ద్వారా గిట్టుబాటు ధర కల్పించేందుకు అవకాశం కలుగుతుంది.

– రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

జిల్లాలో మండలాల వారీగా సాగు విస్తీర్ణం

మండలం	ఆర్‌బీకేలు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)
పాలకొండ	24	17010.45
వీరఘట్టం	24	9771.47
కురుపాం	20	21376.73
గుమ్మలక్ష్మీపురం	23	16317.12
జియ్యమ్మవలస	25	24544.73
కొమరాడ	17	19724.23
గరుగుబిల్లి	13	16044.50
మక్కువ	16	21628.50
సాలూరు	22	27490.98
పాచిపెంట	17	17298.12
పార్వతీపురం	21	17299.75
బలిజిపేట	19	18260.88
సీతానగరం	20	18179.23
సీతంపేట	29	10851.34
భామిని	16	14365.46

క్లుప్తంగా

అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు కొత్తవలస విద్యార్థి



ధ్రువీకరణ పత్రాన్ని ప్రకాశ రావుకు అందజేస్తున్న చీఫ్‌కోచ్ రుకమాకరరావు

కొత్తవలస: ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు సౌత్ కొరియాలో జరగనున్న అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన ఎం.ప్రకాశరావు ఎంపికైనట్లు చీఫ్‌కోచ్, ఆలిండియా సంఘమిత్ర స్పోర్ట్స్ చైర్మన్ పి.రుకమాకరరావు గురువారం తెలిపారు. సీనియర్ విభాగంలో (78 కేజీలు) ఆంధ్రప్రదేశ్ తైక్వాండోఅసోసియేషన్ తరఫున ప్రకాశరావు ఆడుతాడని చెప్పారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ధ్రువీకరణ పత్రాన్ని ప్రకాశరావుకు ఆయన అందజేశారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జెడ్పీ చైర్మన్‌తో ఏపీ ఎన్జీవో అధ్యక్షుడి భేటీ



జెడ్పీచైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు తదితరులు

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కేవీ శివారెడ్డి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ చైర్మన్ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కాసేపు ముచ్చటించారు. ఈ భేటీలో ఏపీఎన్జీవో పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో ఏఓ, క్లర్క్ అరెస్ట్

విజయనగరం క్రైమ్: పోలీస్ శాఖలో భద్రత పేరుతో రుణాలిచ్చి తర్వాత కాలంలో ఆ వ్యక్తి చనిపోయినప్పటికీ వారి కుటుంబ సభ్యులను వేధించి డబ్బులు తీసుకున్న ఇద్దరు మోసగాళ్లను వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్పీ ఎం. దీపిక అందించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఓ గా విధులు నిర్వహిస్తున్న జి.వెంకటరమణ, కర్లక్ జి.విజయకుమార్ పోలీసు శాఖలో భద్రతా రుణాల వ్యవహారాలు చూస్తుంటారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్పించిన రుణాల డాక్యుమెంట్లను సరిచూసి, ఎలిజిబులిటీ ఇస్తుంటారు. ఇదిలా ఉంటే శాఖాపరంగా రుణం తీసుకున్న వారిలో కొందరు చనిపోయారు. అలా ఎవరైనా మృతి చెందినట్లయితే అక్కడితో వారి అకౌంట్ క్లోజ్ అయిపోతుంది. అయితే ఈ విషయం మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తెలియజేయకుండా రుణం డబ్బులు కట్టాలని ఒత్తిడి తీసుకువచ్చి పలువురి నుంచి చెక్‌లు తీసుకుని సొంతానికి వాడుకున్నారు. ఈ విషయం ఎస్పీ దీపిక దృష్టికి వెళ్లడంతో ఆమె ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీసులు విచారణ చేపట్టగా..ఏఓ వెంకటరమణ, క్లర్క్ విజయకుమార్ తప్పు చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు.

మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతులకు ఉపాధి కలిగించే పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జీబీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మహిళా ప్రాంగణంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఫాబ్రిక్ పెయింటింగ్ అండ్ మగ్గం వర్క్ కోర్సులలో 30 రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు. వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. 45 ఏళ్లలోపున్న గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం 99595 21662, 96426 18599 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎత్తుబ్రిడ్జి జంక్షన్ ఆధునికీకరణకు చర్యలు

విజయనగరం: జిల్లా కేంద్రంలో గల ఎత్తుబ్రిడ్జి జంక్షన్ ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు అన్నారు. ఈ మేరకు విశాఖ – విజయనగరం మార్గంలో గల జంక్షన్ ఆధునీకరణ పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం ఫోర్ట్: దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు స్థానిక దాసన్నపేటలో ఉన్న విద్యుత్‌భవన్ వద్ద గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ చైర్మన్ డి.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. గ్రేడ్-2 జేఎల్‌ఎంలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు, చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు త్రినాథరావు, శశికళ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఎస్ నీటి విడుదల



వీఆర్ఎస్ కుడి ప్రధానకాలువ గేట్లు విడుదలచేస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే వెంకటచినఅప్పలనాయుడు

సెల్ఫీ రాజన్న



సెల్ఫీ తీస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ వరదనీటితో నిండుకోవడంతో ముచ్చటగా కనిపించింది. దీంతో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, మావుడి సోదరులు శ్రీనివాసరావు, రంగునాయుడులతో కలిసి డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, ఓసెల్ఫీ తీశారు. ఈ సందర్భంగా ఆయన తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. చదువుకున్న రోజుల్లో వీఆర్ఎస్ వద్దకు స్నేహితులతో కలిసి వచ్చి ఆడుకునేవారమని, కాసేపు సేదతీరి ఇంటి వెళ్లేవారమన్నారు.

మక్కువ: వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ ప్రధానకాలువల ద్వారా సాగునీటిని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు గురువారం విడిచిపెట్టారు. ముందుగా కుడి ప్రధానకాలువ స్పిల్‌వే వద్ద పూజలు నిర్వహించారు. గంగపూజ చేసి కుడి ప్రధానకాలువ గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టారు. అనంతరం ఎడమ కాలువ వద్ద పూజలు నిర్వహించారు. రెండు కాలువల నుంచి 100క్యూసెక్కులు చొప్పున పంటకాలువలకు నీటినివిడిచిపెట్టారు. వీఆర్ఎస్ ప్రాజెక్ట్ నీటిమట్టం 161 మీటర్లు కాగా, ప్రస్తుతం 159మీటర్లు నీరు నిల్వ ఉన్నందున రైతుల ఖరీఫ్‌సాగుకు అవసరమైన నీటి కొరత లేకుండా పోయింది.

రైతుశ్రేయస్సే సీఎం లక్ష్యం

రైతుల శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సీఎం, గిరిజనశాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఈ సందర్భంగా అన్నారు. వీఆర్ఎస్ ప్రాజెక్ట్ వద్ద రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దగెడ్డ ద్వారా రెండవపంట (వేసవిపంట)కు నీరు విడుదలచేయలేదన్న టీడీపీ ఆరోపణలు వింటుంటే నవ్వు వస్తోందన్నారు. సాలూరు నియోజకవర్గంలో ఉన్న ప్రాజెక్ట్‌ల ద్వారా కేవలం ఖరీఫ్‌సాగుకు మాత్రమే నీటిని విడుదల చేస్తారని, వేసవిలో ఆరుతడి పంటలకు మాత్రమే నీరు అందిస్తారన్న, విషయం టీడీపీ నాయుకులకు తెలియకపోవడం విడ్డూరమన్నారు. రైతులకు ఉచితంగా 9గంటలు సాగునీరు అందిస్తున్నది ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, రైతుల కోసం టీడీపీ ఏంచేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

మంత్రి రాజన్నదొర కృషి ఫలితమే జైకా నిధులు

డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర కృషిఫలితంగానే జైకా నిధులు వచ్చాయని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయంలో ఎమ్మెల్యేగా ఉన్న రాజన్నదొర పట్టువదలని విక్రమార్కుడిలా, అప్పటి జిల్లామంత్రి బొత్స సత్యనారాయణ సహకారంతో జైకా నిధుల కోసం ప్రయత్నం చేశారన్నారు. వీఆర్ఎస్ ఆధునికీకరణ పనులు పూర్తయితే మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాలకు చెందిన 24,700ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, మక్కువ, సాలూరు, మెంటాడ మండలాల వైఎస్సార్‌సీపీ నాయుకులు పూడి దాలినాయుడు, పెంట సంజీవునాయుడు, దండి శ్రీను, పి.మధు, ఈఈ ఆర్.అప్పలనాయుడు, డీఈ సురేష్, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, జేఈలు, రైతులు పాల్గొన్నారు.

ఏపీయుడబ్ల్యుజే సభలకు ఏర్పాట్లు పూర్తి

- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

విజయనగరం: జిల్లా వేదికగా నిర్వహించతలపెట్టిన ఏపీయూడబ్ల్యూజే 26వ మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని..ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు విజయనగరం జెడ్పీ సమావేశ మందిరంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ.ప్రసాదరావు తెలిపారు. పదకొండు నియోజక వర్గాల నుంచి వచ్చే పాత్రికేయులతో పాటు నూతనంగా యూనియన్‌లోకి రావాలన్న ఆలోచన ఉన్న సభ్యులకు కూడా మహాసభలకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నామని తెలియజేశారు. ఈ మేరకు గురువారం విజయనగరంలోని అంబటి సత్రం వద్ద ఉన్న ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు జాతీయ మీడియా సలహాదారు అమర్, ఐజేయు జాతీయ నాయకులు శ్రీనివాసరెడ్డి, సోమసుందర్, రాష్ట్ర యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఐవీ.సుబ్బారావు, చందు జనార్దన్‌లతో పాటు సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి.ధర్మారావు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చెర్మన్ మజ్జి శ్రీనివాసరావులతో పాటు ఉమ్మడి విజయనగరం జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పాల్గొంటారని వివరించారు.

పాత్రికేయులకు సన్మానం

సమావేశంలో జిల్లా కార్యదర్శి పంచాది అప్పారావు మాట్లాడుతూ ఇరవై ఏళ్ల పాత్రికేయ వృత్తిలో ఉన్న పాత్రికేయులకు ఈ సందర్భంగా సన్మానకార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఇంకా సమావేశంలో యూనియన్ నాయకులు వి.మహాపాత్రో, టి.రాధాకృష్ణలు మాట్లాడుతూ మహాసభల అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల జీఎస్ఆర్ (గురాన సాధూరావు) హోటల్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల జర్నలిస్టుల సదస్సు ఉంటుందని తెలిపారు. అలాగే జెడ్పీలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు జీవీ ప్రసాద్, కేజే శర్మ ,సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు

వంగర: ఏనుగులు సంచరిస్తున్న గ్రామాల్లో నష్టం వాటిల్లిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన వంగర మండలంలోని శివ్వాం గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన రైతు వెంకటనాయుడు 30 బస్తాల ధాన్యంతోపాటు రేకుల షెడ్డను ఏనుగుల గుంపుధ్వంసం చేయడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగాం, మద్దువలస, శివ్వాం, బాగెంపేట తదితర గ్రామాల్లో 10 రోజులకు పైగా ఏనుగులు గుంపు నష్టపరిచిన వివరాలను సేకరించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, బొక్కేల వెంకటప్పలనాయుడు, ఆలుబిల్లి సుదర్శనరావు తదితరులున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రేగిడి: మండల పరిధిలోని కోడిశ గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన పెదగాడ హరిబాబు(37) ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఎస్సై ఇ.శ్రీనివాసరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. హరిబాబుకు భార్య పార్వతి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. విశ్వ బ్రాహ్మణ కులానికి చెందిన హరిబాబు మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవలు పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఫిర్యాదు మేరకు వచ్చిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామానికి సమీపంలో గత నెల 13న లారీ డ్రైవర్‌ను హత్య చేసి రైల్వే పట్టాలపై పడి వేసిన హత్యకు సంబంధించిన కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసినట్లు గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ లారీ డ్రైవర్ జగదీష్ యాదవ్‌ను ప్రయాణికుల ముసుగులో హత్య చేసి లారీతో సహ ఉండాయించి మృతదేహాన్ని పట్టాలపై పడవేసిన ఉదంతంలో ప్రధాన నిందితుడు హరి ఈశ్వర్రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	60,380-00
బంగారం(22కె. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹200	₹ 210

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- నియోజకవర్గాల పరిశీలకులకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం దిశానిర్దేశం
- మూడు నియోజకవర్గాలకు పరిశీలకుల మార్పు



అసెంబ్లీ నియోజకవర్గ సమావేశానికి హాజరైన నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులకు పార్టీ అధిష్టానం దిశానిర్దేశం చేసింది. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశానికి విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు హాజరయ్యారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు (పాతపట్నం), పాలవలస విక్రాంత్ (గజపతినగరం), కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు (ఎచ్చెర్ల), కేవీ సూర్యనారాయణరాజు (పలాస), మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి (పార్వతీపురం), టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ (ఇచ్ఛాపురం), డోల జగన్ (విజయనగరం), కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు (నెల్లిమర్ల), పేరాడ తిలక్ (రాజాం), డాక్టర్ నిమ్మాన దాస్ (చీపురుపల్లి), కరిమి రాజేశ్వరరావు (బొబ్బిలి), తైనాల విజయ్‌కుమార్ (ఎస్.కోట), తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ (కురుపాం), గొండు కృష్ణమూర్తి (పాలకొండ), శ్రీనివాసరెడ్డి (సాలూరు) తదితరులు పాల్గొన్నారు. ఇప్పటివరకూ విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా వ్యవహరించిన లల్లూ అగర్వాల్ స్థానంలో డోల జగన్ నియమితులయ్యారు. డోల జగన్ ఇప్పటివరకూ పరిశీలకుడిగా ఉన్న పాలకొండ నియోజకవర్గంలో శ్రీకాకుళం డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి బాధ్యతలు తీసుకున్నారు. మీసాల నీలకంఠం నాయుడు స్థానంలో సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా భీమిలికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డిని అధిష్టానం నియమించింది.

వెంపడాం పీఏసీఎస్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ అధ్యక్షుడిగా వాళ్లె సత్యనారాయణని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గురువారం ఉదయం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో సత్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే మెంబర్లుగా బొబ్బాది సూరినాయుడు, పతివాడ కన్నంనాయుడులను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి ఎ. వెంకటసత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి ఎల్లంనాయుడు, పిన్నింటి నారాయణప్పడు, పిన్నింటి ఆదినారాయణ, గుడివాడ అక్కునాయుడు, వాళ్లె భాస్కరరావు, పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి

- రిజిస్ట్రార్ డాక్టర్ పెదిరెడ్ల పల్లవి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: సీనియర్లు, నూతన విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పెదిరెడ్ల పల్లవి సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ర్యాగింగ్‌పై కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయని, చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కనీసం ఆరు నెలల నుంచి 10 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ రమణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువుల కాణాచి జేఎన్‌టీయూ

- రెండేళ్ల నుంచి 'జాతీయ నూతన విద్యావిధానం'
- ఆరేళ్లలో 1,071 మందికి ప్లేస్‌మెంట్

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల సందడి తాజాగా మొదలైంది. ఈ నేపథ్యంలో ఉత్తమ ప్రమాణాలున్న కళాశాలలను ఎంపిక చేసుకునే పనిలో ఇంజినీరింగ్ అభ్యర్థులు బిజీగా ఉన్నారు. పట్టణ శివారున ఉన్న జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ పరిధిలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఉద్యోగకల్పనలో ముందు వరుసలో ఉంది. రెండేళ్ల నుంచి నూతన విద్యా విధానాన్ని కళాశాలలో అమలులోకి తెచ్చింది. మరో వైపు ఉన్నత విద్యశాఖ ఈ కళాశాల ప్రాంగణంలో జేఎన్‌టీయూ, గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీని గత ఏడాది విద్యాసంవత్సరంలో ఏర్పాటు చేసింది.



జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణం



జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ల్యాబ్‌లు, తరగతిగదులు

నూతన సిలబస్‌తో బోధన

విద్యార్థుల నైపుణ్యం పెంచే విధంగా మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సులలో హానర్స్, మైనర్ పేరుతో విస్తరణ డిగ్రీలను గత ఏడాది నుంచి ప్రవేశపెట్టారు. జాతీయ నూతన విద్యావిధానానికి అనుగుణంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి రూపొందించిన నూతన సిలబస్, బోధనావిధానాన్ని అమలులోకి తెచ్చింది. మొత్తం 8 సెమిస్టర్స్‌లో తొలి మూడు మినహా మిగిలిన ఐదు సెమిస్టర్స్‌తోపాటు 10 నెలల ఇంటర్న్‌షిప్ చేయిస్తారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, ట్రిపుల్ ఈ, ఐటీ, మెకానికల్ డిగ్రీలలో 66 సీట్ల చొప్పున, సివిల్, మెటలర్జికల్ సబ్జెక్టు డిగ్రీలలో 33 సీట్లు వంతున కోర్సులను స్థానిక జఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహిస్తోంది.

ఏడేళ్లలో 1,071 మందికి ప్లేస్‌మెంట్

ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి పాలన సమయం 2007లో ప్రారంభమైన ఈ కళాశాల ఏడు కోర్సులలో బీటెక్ డిగ్రీని అందిస్తుంది. దినదినాభివృద్ధి చెందుతూ మౌలిక సదుపాయాలు, బోధనా సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. గడిచిన ఏడేళ్లలో 1,071 మంది విద్యార్థులకు వివిధ కంపెనీలలో అత్యధికంగా రూ.12 లక్షల వార్షిక వేతన ఉద్యోగాలను ఈ కళాశాల ఇప్పించింది. ప్రస్తుతం నడుస్తున్న విద్యాసంవత్సరం నాలుగో సంవత్సర విద్యార్థులు ఇంతవరకు 180 మంది ఉద్యోగాలు సాధించారు.

బోధన సహకరించింది



కాగ్నిజెంట్, ఎల్‌అండ్‌టీ ఇన్ఫోటెక్, ఇంక్సర్, విప్రో సంస్థల్లో ఉద్యోగం వచ్చింది. ఒకేసారి ఇన్ని సంస్థల నుంచి అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. కళాశాలలో నైపుణ్యాభివృద్ధికి అనుగుణంగా అందించే బోధన వల్లే సాధించగలిగాను. మొదటి నుంచి ఆంగ్ల భాష, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్‌పై సాధన చేస్తూ ఆందోళన లేకుండా మాట్లాడడంలో ప్రావీణ్యం సాధించాను. ఇంజినీరింగ్ సబ్జెక్టులతోపాటు ఉద్యోగావకాశాల అదనపు అంశాల్లో అందించే గైడెన్స్ కళాశాలలో అధికంగా ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకున్నాను.

మోటుపల్లి విజయసాయి,
బీటెక్ ఐ.టీ, జేఎన్‌టీయూ, విజయనగరం

కోర్సేతర అంశాలలో ప్రతిభ



ఇన్ఫర్ ఇండియా, కాగ్నిజెంట్, సీజీఐ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. కోర్సెరాలోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ నిర్వహించిన ప్రతిష్టాత్మక 'డేటా ఎనాలిసిస్' కోర్సును పూర్తి చేయడంతోపాటు 'సీలాంగ్వేజ్', పైథాన్ లాంగ్వేజ్, డేటా స్ట్రక్చర్స్ కోర్సుల్లో పట్టు సాధించాను. ఆ తరువాత 'ఎక్స్‌సిస్ డేటా ల్యాబ్స్' నిర్వహించిన ఐటీ ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ప్రాంగణ ఎంపికలకు హాజరయ్యాను. ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలో ఇంజినీరింగ్ సబ్జెక్టు అంశాలతో పాటు ఆ సంస్థకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాలను గుర్తించారు. కళాశాలలో ప్రత్యేకించి ఉన్న ప్లేస్‌మెంట్ విభాగం ఆదిశగా అందించిన శిక్షణ వల్ల ఉద్యోగం లభించింది.

ఓరుగంటి అంజన్‌కుమార్,
బీటెక్ ట్రిపుల్‌ఈ, 4వ సంవత్సరం

ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు



ఉద్యోగ కల్పనే లక్ష్యంగా విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచే ప్రణాళికలను రూపొందించాం. దేశ, అంతర్జాతీయ స్థాయిలోని 30 ప్రతిష్టాత్మకంగా కంపెనీలతో ఉద్యోగ నియామక ఒప్పందాలు పెట్టుకున్నాం. వీరు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఎంపిక చేపడతారు. ఇంజినీరింగ్ కోర్సులపై అత్యాధునిక బోధనా విధానాన్ని అనుసరించడంతో పాటు విద్యార్థుల్లో ఉన్న అభిరుచికి అనుగుణంగా వారిలోని నైపుణ్యాన్ని వెలికితీస్తాం. అందుకు అవసరమైన జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం.

ప్రొఫెసర్ శ్రీకుమార్, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూ
ఇంజినీరింగ్ కళాశాల, విజయనగరం